క్లుప్తంగా

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి



వైద్య సలహాలు ఇస్తున్న విద్యార్థులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల 2023బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు శనివారం ఇంటింటా ప్రజల ఆరోగ్యస్థితిపై సర్వే కార్యక్రమం నిర్వహించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు ఆదేశాల మేరకు కళాశాల విద్యార్థులు బ్యాచ్‌లుగా ఇంటింటికీ వెళ్లి వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముందుగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి చేరుకోగా వారికి డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్ సర్వేపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, కావ్య రాసస్, అఖిల్, రవీందర్, నాగరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి సల్మా పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు

ఎలిగేడు: వేసవికాలంలో ఎండలు మండుతున్న తరుణంలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో భాస్కర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ మండలానికి రూ.లక్ష మంజూరు చేశారని ఆయన తెలిపారు. గ్రామాల్లో పైపు లైన్ లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. రేషన్ కార్డుల వెరిఫికేషన్ పూర్తి చేయాలని, ఇంటి పన్నులు, నల్లా బిల్లులు 2025–26కు సంబంధించి సిద్ధం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీవో కిరణ్, మిషన్ భగీరథ ఏఈ సంధ్య, గ్రిడ్ ఏఈ శ్రావణి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడుదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిలుక శంకర్

జ్యోతినగర్: మేడే పోరాట స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో శనివారం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలపై రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మేడేను విజయవంతం చేయాలన్నారు. మహిళా కార్మికులు కనకలక్ష్మి, రజిత, లక్ష్మి, రాజేశ్వరి, శంకరమ్మ, భీమమ్మ, పద్మ, దేవమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ధర్మారంలో బంద్ సంపూర్ణం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ధర్మారం: ధర్మారంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకుల పిలుపు మేరకు వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎలిగేడు: వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని మండల మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు. పార్టీ నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి వినోద్, కవ్వంపల్లి నారాయణ, రాజేశం, సతీశ్ పాల్గొన్నారు.

మూగజీవాలకు లంపీస్కిన్ వైరస్

- ఆందోళనలో రైతులు
- అవగాహన సదస్సులు నిర్వహించని అధికారులు



గోపరపల్లెలో లేగదూడకు సోకిన లంపీస్కిన్ వైరస్

ఓదెల: మండలంలో పశువులకు (లేగదూడలకు) లంపీస్కిన్ వైరస్ సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిరోజులుగా మండలంలోని ఉప్పరపల్లె, గోపరపల్లె, కొలనూర్, ఓదెల, ఇందుర్తి, గుంపుల, కనగర్తి గ్రామాల్లో పశువులకు, లేగదూడలకు నల్లటి మచ్చలతో లంపీవైరస్ సోకడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒకవైపు ఎండల తీవ్రతతో మరోవైపు లంపీస్కిన్ రావటంతో మూగజీవాలు తల్లడిల్లుతున్నాయి. 15రోజుల నుంచి పశువులు తీవ్రజ్వరంతో మేతమేయకుండా పూర్తిగా నడవరాని స్థితిలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లటి మచ్చలు, గడ్డితినకపోవటం, రోగ నిరోధక శక్తి తగ్గి నీరసించి పశువులు కిందపడి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలోని మార్పుల తోనే లంపీస్కిన్ సోకుతున్నట్లు పశువైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. కానీ పశువైద్యసిబ్బంది లంపీస్కిన్‌పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించకపోవటంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది స్పందించి సకాలంలో వైద్యసేవలు అందించాలని మండలంలోని అన్నదాతలు కోరుతున్నారు.

టీకాలు వేస్తున్నాం

మండలంలోని గోపరపల్లెలో పశువులకు లంపీస్కిన్ వైరస్ సోకింది. సిబ్బందితో పశువులకు టీకాలు వేస్తున్నాం. ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వైరస్ సోకిన పశువులకు రైతులు టీకాలు వేయించాలి.

– సునీత, పశువైద్యాధికారి, కొలనూర్

పహల్గాం మృతులకు కొవ్వొత్తుల నివాళి



పెద్దపల్లిరూరల్: కొవ్వొత్తులతో నివాళి



యైటింక్లయిన్‌కాలనీ: ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జెండాకూడలి వద్ద పహల్గాం మృతులకు నివాళి అర్పించారు. ఎమ్మెల్యే విజయరమణారావు, తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపినవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్‌రహదారిపై ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని సుల్తానాబాద్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో శనివారం నిరసన అనంతరం ర్యాలీ నిర్వహించారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని



సుల్తానాబాద్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన

పెద్దంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో కాలనీలో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌరస్తా వద్ద పహల్గాం మృతులకు నివాళి అర్పించారు.

కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న కిరణ్‌రాజ్‌కుమార్

గోదావరిఖని: కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులతో శనివారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి హైదరాబాద్‌లో నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చబోతోందన్నారు. వైద్యుల కొరత తీర్చేందుకు త్వరలో డాక్టర్ల నియామకం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఏసీఎంవో డాక్టర్ అంబిక, డాక్టర్లు మద్దిలేటి, కాశేశ్వర్‌రావు, పాండురంగాచారి, మొగిలి పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ క్యాంప్ వద్ద డీజిల్ బంక్ ప్రారంభం



డీజిల్ బంక్‌ను ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: ఓసీపీ–3 ఆర్‌వీఆర్ క్యాంప్ వద్ద డీజిల్ బంక్‌ను ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య శనివారం ప్రారంభించారు. అనంతరం వ్యూపాయింట్ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ నర్సింహారావ్, ప్రాజెక్ట్ అధికారి ఉదయ్‌హరిజన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, డీజీఎం సివిల్ ధనుంజయ, మేనేజర్ భారత్‌కుమార్, బంక్ ఇన్‌చార్జి హరిప్రసాద్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ ఉన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కందుల సంధ్యారాణి

రామగుండం: క్రీడలు వ్యక్తుల మధ్య స్నేహాన్ని పెంచుతాయని, ఆరోగ్యం, ఆహ్లాదం, మానసిక ప్రశాంతత, మంచి ప్రవర్తన, పోటీతత్వం, సమాజంలో గుర్తింపు క్రీడలతోనే సాధ్యమని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని ముబారక్‌నగర్‌కు చెందిన నిసార్–ఇమ్రాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వీరి స్మారకార్థం పట్టణంలోని జెన్‌కో క్రీడా మైదానంలో గ్రాండ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్‌వేసి బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బీజేపీ ప్రతినిధులు మిట్టపల్లి సతీశ్, సతీశ్‌రెడ్డి, ఈదునూరి చిరంజీవి, కుడుముల సంజీవ్, సిలివేరు అంజి, సల్మాన్, చోటేమియా, బాబర్, మహరాజ్, ఉమర్, ఆసిఫ్, దయాకర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మిక హక్కుల సాధన కోసం పోరాటం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, చట్టబద్ధ హక్కుల సాధన కోసం 29న సింగరేణివ్యాప్తంగా అన్ని ఏరియాల్లో ధర్నా నిర్వహించనున్నట్లు హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కోరారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కోలిండియా కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చేవిధంగా వేతనాలు, లీవులు, పండుగ సెలవులు, ఈఎస్ఐ సౌకర్యం, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని కోరారు. ధర్నాలో కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, నాయకులు సారయ్య, అనిల్‌రెడ్డి, ఐ.కృష్ణ, ఇ.నరేశ్, ఐ.రాజేశం పాల్గొన్నారు.

29న పెద్దపల్లి బంద్

పెద్దపల్లిరూరల్: పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ 29న పెద్దపల్లి బంద్ పాటిస్తున్నామని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిషోర్ శారడ తెలిపారు.


పోరాటాల ఫలితంగానే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: తమ యూనియన్ పోరాటాల ఫలితంగానే అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల పోరాటం ఫలితంగా కార్మిక కుటుంబాలకు మంచినీటి సరఫరా కోసం గ్రావిటీ ఫిల్టర్‌బెడ్ నిర్మాణం జరుగుతోందన్నారు. అలాగే కార్మిక వాడల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయని తెలిపారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణ కోసం ఆధునిక పరికరాలు ఏర్పాటు చేస్తున్నారని, గుండె సంబంధ వ్యాధుల నిర్ధారణ కోసం వార్డులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు మేదరి సారయ్య, రాజమౌళి, శ్రీనివాస్, నరహరిరావు, రవి, సురేశ్, రమేశ్, ప్రభాకర్, రాజేందర్, రమేశ్, దశరథరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రపంచ కార్మిక దినోత్సవం విజయవంతం చేయాలి



జ్యోతినగర్: కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద శనివారం మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. రాఘవరెడ్డి, రాజ్‌కుమార్, చంద్రమౌళి, పరమేశ్, ప్రభాకర్, వెంకన్న, శ్రీనివాస్, సంపత్, చక్రవర్తి, శ్రీనివాస్, వెంకటేశం, అజయ్ పాల్గొన్నారు.

మేడిపల్లి సెంటర్‌లో..

ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో మున్సిపల్ కార్మికుల సమక్షంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బిక్షపతి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి శనివారం కరపత్రం ఆవిష్కరించారు. సునీత, లక్ష్మయ్య, పెగడపల్లి లక్ష్మణ్, రాణి, దేవమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రామగుండం: మే డే విజయవంతం చేయాలని శనివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సీఐటీయూ ప్రతినిధులు కరపత్రాలు అందజేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: మే డే వేడుకలను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ అన్నారు. సింగరేణి ఆర్జీ–2 ఏరియా రైల్వే కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి శనివారం మే డే పోస్టర్ ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకటేశ్, అయిలయ్య, సదానందం, వెంకటి, శంకర్ పాల్గొన్నారు.

ఓదెల: మేడేను దీక్షాదినంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు కోరారు. ఓదెలలో శనివారం మేడే కరప్రతాలను ఆయన ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ పైడిపల్లి నాగయ్య, ఆకుల నరేశ్, నాయకులు సదానందం, తూడి సారయ్య, శనిగరపు బాపు, శంకర్, జగన్, తిరుపతి, సారయ్య పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మేడేను దీక్షాదినంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ నేతృత్వంలో నిర్వహించే మేడే ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు దొడ్ల రాజబాబు, చల్లట రాజయ్య, లక్ష్మణ్, మధునయ్య, కొమురయ్య, గట్టయ్య, మహేశ్, లక్ష్మ, అనసూర్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

గుండెపోటుతో సెక్యూరిటీగార్డు మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన జక్కం రాంనారాయణ (48) శనివారం గుండెపోటుతో మరణించాడు. కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న రాంనారాయణ ఎప్పటిలాగే విధులకు వెళ్లాడు. నీరసంగా ఉందని, తిరిగి ఇంటికి వచ్చాడు. పరిస్థితిని గమనించిన కుటుంబీకులు పెద్దపల్లిలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుకు గురై మృతిచెందాడు.

బాత్‌రూంలోజారిపడి మరొకరు..

పెద్దపల్లి పట్టణం శాంతినగర్‌లో నివాసముంటున్న తాడిచెట్టి రమేశ్ (47) స్నానం చేసేందుకు వెళ్లి బాత్‌రూంలో జారిపడి మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

ఓదెల: మండలంలోని మడక గ్రామంలోని ఉపాధి పనులను ఏపీడీ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. మడకలో ఉపాధిహామీ కింద ఏర్పాటు చేసిన నర్సరీ చెట్లతో పాటు చేపట్టిన పనులను ఆయన పర్యవేక్షించారు.



ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలోని కిరాణం షాప్‌నకు అతి సమీపంలోనే ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. గ్రామానికి చెందిన అంజనీప్రసాద్ చౌరస్తాలో కిరాణం నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల దుకాణం సమీపంలోని విద్యుత్ స్తంభానికి అధికారులు 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం అమర్చిన విద్యుత్ తీగలు మనిషికి తగిలేలా ఉండి ప్రమాదకరంగా మారాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరేచోట ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

శ్రమ, పట్టుదల, క్రమశిక్షణతోనే విజయం



శ్రీరామ పట్టాభిషేకం ప్రదర్శనలో విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: శ్రమ, పట్టుదల, క్రమశిక్షణతోనే విజయం సాధ్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత కాల్వ లీలావతి రాంచంద్రారెడ్డి నియలంలో వేదవ్యాస హైస్కూల్ 15వ వార్షిక వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరస్పాండెంట్ ఉమామహేశ్వర్ ఎమ్మెల్యేకు శాలువాకప్పి సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన శ్రీరామ పట్టాభిషేక ఘట్టం, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

అంకితభావంతో కృషి చేస్తేనే సత్ఫలితాలు

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అంకిత భావంతో ఉపాధ్యాయులు, యాజమాన్యం కృషి చేస్తేనే సత్ఫలితాలు సాధించవచ్చని 'సాక్షి' మీడియా డైరెక్టర్ కేఆర్‌పీరెడ్డి అన్నారు. ఫోన్ ద్వారా 15వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గతంలో మాదిరిగా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సదయ్య, డైరెక్టర్ దివాకర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఉత్పత్తి లక్ష్యసాధనకు ఉద్యోగులు కృషిచేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణరావు

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు ఉద్యోగులు కృషి చేయాలని సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు సూచించారు. ఆర్జీ–1 సీఎస్పీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రవాణా లక్ష్యాన్ని మించి 134శాతం సాధించిన ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేసుకుంటూ బ్రేక్‌డౌన్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతీఒక్కరు ముందుండాలని సూచించారు. డైరెక్టర్ వెంట ఈఅండ్ఎం ఏజీఎం వెంకటేశ్వర్‌రావు, అధికారులు దాసరి శ్రీనివాస్, చంద్రశేఖర్, హరీశ్ కుమార్, రాజేందర్ ఉన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలు రూ.36వేల కోట్లు వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. బీఎంఎస్ కృషి ఫలితంగానే జనరల్ మజ్దూర్ల డిజిగ్నేషన్ జనరల్ అసిస్టెంట్లుగా మారిందన్నారు. బకాయిలు సకాలంలో చెల్లిస్తే సంస్థ పురోభివృద్ధికి తోడ్పతుందన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో రాజీలేని పోరాటం చేస్తున్నామని వివరించారు. మండుతున్న ఎండల్లో ఓసీపీ క్వారీలో పనిచేస్తున్న కార్మికులకు తగిన వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎండదెబ్బకు గురైతే సకాలంలో వైద్యం అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, షిఫ్టు వేళలు మార్చాలన్నారు. నాయకులు కర్రావుల మహేశ్, మాదాసి రవీందర్, తాట్ల లక్ష్మయ్య, సంగాని సాంబయ్య, ఎల్లావుల కోటయ్య, పెంచాల వెంకటస్వామి, కుమ్మరి నగేశ్, చీకట్ల మల్లేశ్, ఆరెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా శనివారం పదోన్నతి లభించింది. మంచిర్యాల మున్సిపాలిటీకి డిప్యూటేషన్‌పై వెళ్లిన హెల్త్ ఇన్‌స్పెక్టర్ వైకుంఠంతోపాటు మంథని మున్సిపాలిటీకి డిప్యూటేషన్‌పై వెళ్లిన హెల్త్ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాథోడ్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి లభించింది.